

# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680

సంపుటి : 4 | సంచిక : 6 | సెప్టెంబర్ 12 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-







# ఉద్యోగులకు సీఎం రేవంత్ పండుగ కానుక

## డీఏల విడుదల - పీఆర్సీపై కీలక నిర్ణయం..!!




- రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం కసరత్తు
- పీఆర్సీ నివేదిక వచ్చాక ఉద్యోగ సంఘాలతో చర్చించి నిర్ణయం
- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్థిక శాఖతో సమీక్ష: సీఎం రేవంత్‌రెడ్డి
- డీఏలపై ఈరోజు లేదా రేపు కీలక ప్రకటనకు అవకాశం
- ఈ నెల 18న సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ
- ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.. మూడు వెంటనే ఇవ్వాలని ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి
- దసరా నుంచే పీఆర్సీ అమలు చేయాలని కోరిన ఉద్యోగ సంఘాలు
- రెండు డీఏలతో ఏటా రూ.6 వేల కోట్ల అదనపు భారం
- వచ్చే నెల 1 నుంచి పెరిగిన డీఏ చెల్లింపుపై అంచనాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్న సీఎం

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 11**

తెలంగాణ ఉద్యోగులకు గుడ్ న్యూస్. తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటనకు కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్ తో ఉద్యోగ సంఘాల నేతల సమావేశం సమయంలో కీలక అంశాల పైన చర్చించారు. దీంతో.. సీఎం సానుకూలంగా స్పందించారు. డీఏలు విడుదల దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, పీఆర్సీ పైన సీఎం రేవంత్ కీలక హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతల సమాచారం. దీంతో.. ప్రభుత్వం చేసే ప్రకటన పైన ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రెండు డీఏ(కరవు భత్యం)లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌తో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశం అయ్యారు. అన్ని అంశాలపై ఆర్థిక శాఖ అధికారులతో

(మిగతా 2వ పేజీలో..)

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని

(మిగతా 2వ పేజీలో..)




## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర

(మిగతా 2వ పేజీలో..)



## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన
- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ

నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు

(మిగతా 2వ పేజీలో..)



## 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం... ఇరువురు నేతలు చర్చించిన అంశాలు ఇవే

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 11**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ అయ్యారు. ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 12-13 తేదీలలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇందుకోసం పుతిన్ ఈరోజు (సెప్టెంబర్ 11) తెల్లవారుజామున న్యూఢిల్లీ చేరుకున్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దాదాపు 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం సాగింది. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన, పారిశ్రామిక సహకారంతో సహా ద్వైపాక్షిక ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నాయకులు చర్చించినట్టుగా తెలుస్తోంది. సంబంధిత వర్గాల ప్రకారం... ఇరుదేశాల మధ్య పారిశ్రామిక సహకారాన్ని విస్తరించే మార్గాలపై మోదీ, పుతిన్‌లు ప్రధానంగా చర్చించినట్టుగా తెలుస్తోంది. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు భారతదేశంలో మొదటిసారిగా జరిగిన రష్యా అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన "ఇన్నోప్రోమ్ ఇండియా"ను వారు స్వాగతించారు. వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలను మరింత విస్తరించడంలో దాని ప్రాముఖ్యతను మోదీ, పుతిన్‌లు నొక్కి చెప్పారు. ఇద్దరు నాయకులు ఇన్నోప్రోమ్ ఇండియా ప్రదర్శనను కూడా సందర్శించి, అక్కడ పాల్గొన్నవారితో ముచ్చటించారు.బ్రిక్స్ కూటమిలో భారత్-రష్యా భాగస్వామ్యంపై నాయకులు తమ అభిప్రాయాలను మోదీ, పుతిన్‌లు పంచుకున్నారు.

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం... ఇరువురు నేతలు చర్చించిన అంశాలు ఇవే

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ ఆసియా , నల్ల సముద్ర ప్రాంతంలో సముద్ర వాణిజ్యం, భారతీయ నావికుల భద్రతపై ప్రభావం చూపిన సంఘర్షణలతో సహా, పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా వారు తమ దృక్కోణాలను షేర్ చేశారు.భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ నిలదొక్కుకుంటున్న ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో నిమగ్నమై ఉండటానికి ఇరువురు నాయకులు అంగీకరించారు.సివిల్ న్యూక్లియర్ సహకారం అజెండాలోని మరో కీలక అంశంగా ఉన్నట్టుగా సమాచారం. రష్యాలో నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికుల రాకపోకలను విస్తరించడం, వారి ఉనికిని పెంచడంపై కూడా ఇరుపక్షాలు చర్చించినట్టుగా సంబంధిత వర్గాలు తెలిపాయి.ఇక, 24వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు రష్యాను సందర్శించాలని ప్రధాని మోదీని పుతిన్ ఆహ్వానించారు. ప్రధాని మోదీ ఆ ఆహ్వానాన్ని అంగీకరించారు. దౌత్య మార్గాల ద్వారా పరస్పర సౌలభ్యం మేరకు శిఖరాగ్ర సమావేశ తేదీలను నిర్ణయించనున్నారు. ఇదిలాఉంటే, మోదీ, పుతిన్‌ల మధ్య ఈ ఏడాది జరిగిన రెండో సమావేశం ఇది. మోదీ, పుతిన్‌లు అంతకుముందు 2026 ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన 26వ ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం సందర్భంగా సమావేశమయ్యారు.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిందని వెల్లడి

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.



# ఉద్యోగులకు సీఎం రేవంత్ పండుగ కానుక, డీఏల విడుదల - పీఆర్సీ పై కీలక నిర్ణయం..!!

(మొదటి పేజీ తరువాయి)

చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. కనీసం రెండు డీఏలు చెల్లిస్తే ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.6 వేల కోట్ల భారం పడుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసారు. ఈ రోజు లేదా రేపు డీఏ పైన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నెల 18న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించనున్నందున ఆరోజు ప్రకటన వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న ఉద్యోగ సంఘాల నాయకులు, 3 డీఏల విడుదలపై అసెంబ్లీ సమావేశాల్లోనే ఉత్తర్వులివ్వాలని కోరారు. తెలంగాణలో దసరా పెద్ద పండుగ అని, అప్పటి నుంచే పీఆర్సీ అమలయ్యేలా చూడాలని కోరగా రంజాన్ కూడా పెద్ద పండుగే కదా అని సీఎం నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

**ముందుగా డీఏల విడుదల... పీఆర్సీ పై చర్చలు**

అదే విధంగా పీఆర్సీ నివేదిక అందిన తర్వాత పరిశీలించి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఖరారు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక ఆర్థిక శాఖతో సమావేశమై ఆర్థిక పరిస్థితిని సమీక్షించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం తెలిపారని ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. అయితే.. ఉద్యోగులకు ఇప్పటి వరకు మొత్తం గా ఐదు డీఏలు మంజూరు చేయాల్సి ఉండగా, అందులో మొదటి దానికి రూ.3,700 కోట్లు, రెండో దానికి రూ.2,300 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా చేస్తున్నారు. రెండు డీఏలను ఇప్పటికిప్పుడు మంజూరు చేసి వచ్చే నెల 1వ తేదీ జీతాల నుంచి ఉద్యోగులకు చెల్లిస్తే నెలకు కనీసం రూ.500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని ప్రాథమిక అంచనా. రెండు డీఏలు ఇస్తే రూ.6 వేల కోట్ల ఆర్థిక భారం ఏటా భరించాల్సి ఉన్నందున అంత మేరకే ఆర్థిక శాఖ వివరాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో.. డీఏ పైన ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నేతలు భావిస్తున్నారు.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది: ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

**బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత**

**ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య**

**తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

సెప్టెంబర్ । శనివారం । 12 । 2026




# చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు సి ఐ రమేష్







**మన దునియా,చిలకలూరిపేట**

పట్టణం పురుషోత్తపట్నం అడ్డరోడ్డు వద్ద గత నెలాఖరున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టే ఉద్దేశంతో సెప్టెంబర్ 11న పట్టణంలోని పాత హైవే రోడ్డులోని ప్రధాన కూడళ్లను అధికారులు సంయుక్తంగా పరిశీలించారు

NRT సెంటర్, అడ్డరోడ్డు, విజయా బ్యాంక్ సెంటర్, RTC బస్టాండ్, AMC చెక్‌పోస్టు ప్రాంతాల్లో NHAI అధికారులు, చిలకలూరిపేట టౌన్ CI రమేష్, పల్నాడు జిల్లా ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ CI రమేష్, చిలకలూరిపేట పట్టణ MVI సంయుక్తంగా ఇన్‌స్పెక్షన్ నిర్వహించారుప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను పరిశీలించి వాహనాల వేగ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించేలా పలు భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులు గుర్తించారు ప్రధాన సెంటర్లలో 3 లేయర్ల స్పీడ్ బ్రేకర్ల వ్యవస్థ, S-టైప్ బ్యారికేడ్లు, రోటరీ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, ఆబ్జెక్ట్ హజార్డ్ మార్కింగ్స్, స్పీడ్ బ్రేకర్లు, ాఎమీా, ాఎీదీలు, రోడ్ మార్కింగ్స్ వంటి భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారుప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పటిష్టం చేయనున్నట్లు అధికారులు తెలిపారుత్వరలోనే గుర్తించిన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లను పునరుద్ధరించి, వాహనదారులకు స్పష్టమైన హెచ్చరికలు అందేలా చర్యలు తీసుకోనున్నారు రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా NHAI, పోలీస్, ట్రాఫిక్, రవాణా శాఖల సమన్వయంతో చర్యలు కొనసాగనున్నాయి

# బాలికపై లైంగిక దాడి ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలి





### ఎస్ఎస్ మోడల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి: గవ్వల శ్రీకాంత్

**మన దునియా ;సెప్టెంబర్ 11:**

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్ద నక్కలపేట గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ శారద విద్యానికేతన్ (ఎస్ఎస్ మోడల్ స్కూల్)లో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం (టీవీవైఎస్), వీబీఏ పార్టీ, నేతకాని మహార్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు.బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు. లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల కరస్పాండెంట్ సల్ల శ్రీనివాస్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో గతంలోనూ ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు సమాచారం నేపథ్యంలో వాటిపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఘటన జరిగి నాలుగైదు రోజులు గడిచినా జిల్లా విద్యాశాఖ అధికారి, స్థానిక ఎంఈఓ బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి, తప్పిదం తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన లేదా నిర్లక్ష్యం నిర్ధారణ అయితే ఎస్ఎస్ మోడల్ స్కూల్ గుర్తింపును రద్దు చేసి, పాఠశాలను సీజ్ చేయాలని గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్థానిక ఎంఈఓ శీతలక్ష్మి హామీ ఇచ్చినట్లు తెలిపారు.బాధిత బాలికకు పూర్తి రక్షణ కల్పించి, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా నిష్పక్షపాత దర్యాప్తు చేయాలని కోరారు. బాలిక, కుటుంబ సభ్యులపై తప్పుడు ప్రచారం చేయడం, వారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల సాగుభూమి, బాలికకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని గవ్వల శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర కార్యదర్శి గవ్వల అజయ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు ములుగూరి రమేష్, రవికిరణ్, రాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఆటో నుంచి పడి వ్యక్తి మృతి

**వంకాయలపాడు వద్ద ఘటన**

**మన దునియా, ఎడ్లపాడు:**



ప్రయాణికుల ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ఆటో నుంచి కిందపడిపోయి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన శుక్రవారం ఎడ్లపాడు మండలంలో చోటుచేసుకుంది.గుంటూరు నుంచి ఎడ్లపాడు వైపు వస్తున్న ప్యాసింజర్ ఆటో వంకాయలపాడు గ్రామం దాటిన అనంతరం సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ క్రమంలో డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.వెంటనే స్పందించిన ఆటో డ్రైవర్ షఫరుద్దీన్ 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పరిశీలించి, వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## "చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రేసులో దూసుకుపోతున్న పిల్లి కోటి"



చిలకలూరిపేట పురపాలక ఎన్నికల నగారా మోగే సమయం దగ్గరపడుతున్న వేళ స్థానిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మున్సిపల్ చైర్మన్ పీఠం గనుక ఎస్సీ రిజర్వేషన్‌కు ఖరారైతే, తెలుగుదేశం పార్టీ తరఫున రేసులో నిలిచే బలమైన నాయకుడెవరు అనే చర్చ మొదలైంది. ఈ సమీకరణాల్లో ప్రధానంగా వినిపిస్తున్న పేరు...చిలకలూరిపేట ఋఖా నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లి కోటి. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, క్షేత్రస్థాయి పోరాటాలతో పార్టీ అధిష్ఠానం దృష్టిని ఆకర్షించిన ఆయన పేరు ఇప్పుడు మున్సిపల్ బరిలో హాట్ టాపిక్‌గా మారింది

**కార్యకర్త స్థాయి నుంచి క్రియాశీలక నాయకుడిగా..**

పిల్లి కోటి రాజకీయ ప్రస్థానం నిబద్ధతతో కూడినది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన, మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని పనిచేస్తూ వచ్చారు. స్థానిక సమస్యలపై స్పందించడం, వార్డు స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతనూ విజయవంతంగా నిర్వహిస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారు కష్టకాలంలో ఎదు

## ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు

**లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాదావత్ శ్రీనివాస్ నాయక్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; సెప్టెంబర్ 11:**



జన్నారం: చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో లంబాడ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం నాయకులను రాష్ట్రవ్యాప్తంగా ముందస్తుగా అరెస్టు చేయడాన్ని లంబాడ హక్కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాదావత్ శ్రీనివాస్ నాయక్ తీవ్రంగా ఖండించారు. జన్నారం పోలీసులు ఆయనను ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోతో పాటు చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా అమలు చే య ా ం క ా ఎో వ డ ా ం దురదృష్టకరమన్నారు. తక్షణమే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, విద్యార్థుల సర్టిఫికెట్లను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుతో పాటు ప్రతి గ్రామపంచాయతీకి సంవత్సరానికి రూ.25 లక్షలు ఇస్తామన్న హామీ మేరకు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న రూ.75 లక్షలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించి, జయంతి ఉత్సవాలకు రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 100 ఎకరాల భూమిని కేటాయించి, రూ.1,000 కోట్లతో సేవాలాల్ మహారాజ్, మీరే మాత మందిరాలను నిర్మించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన జీవో 641ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యమాలను అణచివేసేందుకు ముందస్తు అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో పాటు గిరిజన విద్యార్థి సంఘం నాయకులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని, హామీల అమలుకు ప్రజలను చైతన్యపరిచి రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని శ్రీనివాస్ నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## మద్యం మత్తులో అతివేగం.. ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు!

మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 11



హైదరాబాద్, బంజారాహిల్స్: మద్యం మత్తులో ఉన్న యువతీ, యువకుడు వోక్స్‌వ్యాగన్ కారులో అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ఇద్దరు మహిళలను ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో చోటుచేసుకుంది .వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ఆశా ఆసుపత్రి వద్ద రోడ్డుపై వెళ్తున్న ఇద్దరు మహిళలను కారు బలంగా ఢీకొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి మహిళలకు తీవ్ర గాయాలు కాగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన మహిళల్లో రంజనా రాయ్ (32) ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

## బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి పుతిన్.. నేడు ప్రధాని మోదీతో కీలక భేటీ..

మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 11



18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. పుతిన్ బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశంలో ప్రసంగించడానికి ముందు ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు కీలక ఘట్టానికి తెరలేచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఇంధనం, రక్షణ, పెట్టుబడులు, రవాణా తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అలాగే అంతర్జాతీయ పరిణామాలు, ప్రాంతీయ భద్రత, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై ఇరువురూ చర్చించే అవకాశం ఉంది.ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా కూడా మోదీ, పుతిన్ సమావేశమయ్యారు. కాగా, బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు పలు ఇతర దేశాల నేతలతో కూడా సమావేశం కానున్నారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం, ఈజిప్ట అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసిలతో సహా ఇతర అంతర్జాతీయ నాయకులతో కూడా సమావేశాలు నిర్వహించనున్నారు..

## ఇద్దరు యువతులను మోసం చేసిన కానిస్టేబుల్ అరెస్ట్

మన దునియా,హైదరాబాద్,సెప్టెంబరు 11

ఇద్దరు యువతులును మోసం చేసిన ఓ కానిస్టేబుల్‌ను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పదేళ్లుగా ప్రేమించిన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసి.. ఆపై మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో అటు ప్రియురాలు, ఇటు భార్య ఇద్దరూ కలిసి కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన అరుణ్ కుమార్ సీఐడీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తన క్లాస్‌మేట్‌తో పదేళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేసి.. ఆపై ముఖం చాటేశాడు. ప్రేమించిన యువతికి తెలియకుండా జులైలో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. అనుమానం వచ్చిన ప్రేమికురాలు ఆరా తీయగా పెళ్లి విషయం బయటపడింది. మోసపోయాయని గ్రహించిన బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో అరుణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేశారు. అరుణ్‌కుమార్ అరెస్ట్ విషయం తెలుసుకున్న అతని భార్య ఖమ్మంలో అతనిపై ఫిర్యాదు చేసింది. దీంతో ఖమ్మం పోలీసులు కానిస్టేబుల్‌పై మరో కేసును నమోదు చేశారు..




# శ్రీశైలం ఖాళీ.. కారకులెవరు?

మన దునియ,హైదరాబాద్:సెప్టెంబర్ 11

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలు రోజురోజుకూ తీవ్రం కావడానికి కేంద్ర జలశక్తి శాఖతో పాటు గోదావరి--కృష్ణా యాజమాన్య బోర్డుల క్రియారాహిత్యం కూడా ఒక కారణం. చట్టబద్ధత గల ఈ సంస్థలు ఆచరణలో పోస్టాఫీసు పని చేయడానికి అలవాటుపడ్డాయి. కేంద్ర జలశక్తి శాఖ నిమ్మకు నీరెత్తినట్లుంది. రాష్ట్ర విభజన చట్టం సబ్ సెక్షన్(1), సెక్షన్ 84 మేరకు అపెక్స్ కౌన్సిల్ ఎప్పటికప్పుడు రెండు నదీ యాజమాన్య బోర్డుల పని తీరును అజమాయిషీ చేయాల్సి ఉంది. నదీ బోర్డులపై అపెక్స్ కౌన్సిళ్లకు అధికారముందని మన ముఖ్యమంత్రులకూ తెలిసినట్లు లేదు. పన్నెండేళ్ల కాలంలో రెండుసార్లు మాత్రమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. దీనికి తోడు రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు పరస్పర విరుద్ధంగా ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిరాసక్తిగా ఉన్న బోర్డులతో నిమిత్తం లేకుండా తమ అవసరాలు తీర్చుకుంటున్నాయి. ఫలితంగా ఎల్‌నినో ప్రభావం, రానున్న నీటి ఎద్దడి, వచ్చే వేసవి... వీటితో నిమిత్తం లేకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు ఖాళీ చేస్తున్నారు.ఈ ఏడాది ఎల్‌నినో వల్ల వర్షాలు పడవని, సాగునీటికి కాదు కదా, తాగునీటికి కూడా కటకటలాడాల్సి ఉంటుందని లోకం కోడై కూస్తున్నా.. కృష్ణానది యాజమాన్య బోర్డులో చలనం లేదు. నీటి సంవత్సరం జూన్ నుంచి ప్రారంభమైనా, ఇంతవరకు బోర్డు పూర్తిస్థాయి సమావేశం జరగలేదు. త్రిసభ్య కమిటీ అంటూ ఆ మధ్య ఒక సమావేశం జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య పొంతన కుదరకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి ఈ నెల నాలుగున అదే త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. ఒక దఫా త్రిసభ్య కమిటీ సమావేశంలో పొంతన కుదరనపుడు మళ్లీ త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం బోర్డు సభ్య కార్యదర్శి బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోంది. నీటి సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా బోర్డు చైర్మన్ ఏం చేస్తున్నట్లు?ఇదిలావుండగా జల వివాదాల పరిష్కారానికి ఏర్పడిన కేంద్ర కమిటీ సమావేశం ఎజెండా పైనే కుస్తీ పడుతోంది. ఇటీవలి త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాలూ ఎవరి వాదనకు వాళ్లు కట్టుబడగా, ఈ నెల ఆఖరు వారంలో బోర్డు సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించడం నిలిపివేయాలని తెలంగాణ చేసిన ఫిర్యాదును ఆంధ్రప్రదేశ్‌కు; తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం నుంచి కిందకు నీళ్లు వదిలేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ చేసిన ఫిర్యాదును తెలంగాణకు... యాజమాన్య బోర్డు పంపింది. ఈ పనికి చట్టబద్ధత గల సంస్థ అవసరం లేదు. కనీసం బోర్డు సభ్య కార్యదర్శి రెండు రాష్ట్రాలూ తమ అనుమతి లేకుండా ఎవరి వాటా ఎంతో తేల్చే వరకు ఆగాలని హెచ్చరించి ఉండవచ్చు. నీటి సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయి బోర్డు సమావేశం జరగలేదు. అయినా రాష్ట్రాల ప్రజల అవసరాలు మాత్రం ఆగవు కదా? ఈ విషయంలో రాష్ట్రాలను తప్పు పట్టలేం. ఈ లోపు రాయలసీమలో తీవ్ర ఆందోళన మొదలైంది. ఈ ఏడాది సాగునీరు మాట అటుంచి, తాగునీటికి కూడా వలసలు పోయే దుస్థితి ఏర్పడుతుందని, శ్రీశైలం జలాశయం ఖాళీ చేస్తున్నారని ఆందోళనలు జరుగుతున్నాయి. సీమ వాసుల గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నీటి సంవత్సరంలో వంద టీఎంసీలకు పైగా నీళ్లు వృథాగా పోయాయి. ఈ నెల 10 నాటికి శ్రీశైలం నీటిమట్టం 866 అడుగులకు చేరింది.ఈ నెల నాలుగున త్రిసభ్య కమిటీ సమావేశం ముగిస్తూ అప్పటికి మేల్కొన్న బోర్డు సభ్య కార్యదర్శి... శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుదుత్పత్తి నిలిపివేయాలని, ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల ఆపాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఏ రాష్ట్రమూ ఈ ఆదేశాలు పాటించడం లేదు. ఈ నెలాఖరు నాటికి శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజీకి తెస్తారేమో! రోజూ ఇంచుమించు మూడు టీఎంసీల నీళ్లు కిందకు పోవడం గానీ, జలాశయం నుంచి ఎవరికి వారు వాడుకోవడం గానీ జరుగుతున్నది.ఇదిలావుండగా ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇరిగేషన్ శాఖపై సమీక్ష చేస్తూ శ్రీశైలం జలాశయం నుంచి




ఆంధ్రప్రదేశ్ మల్యాల, ముచ్చుమర్రి తదితర అవుట్‌లెట్ల నుంచి నీటిని తరలిస్తున్నందున తాము విద్యుదుత్పత్తి చేసేందుకు శ్రీశైలం జలాశయంలో నీళ్లు ఉండడం లేదని, అందుకు ఏపీ నుంచి పరిహారం కోరేందుకు ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ వద్ద ప్రస్తావించాలని తమ అడ్వొకేట్‌ను కోరారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ విద్యుదుత్పత్తి నిలిపివేస్తుందని భావించగలమా? దేశంలో పలు రాష్ట్రాలు ఉమ్మడిగా అనుభవించే ప్రాజెక్టులు ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడే ఉద్రిక్త పరిస్థితులు వీటి మధ్య లేవు. భాక్రానంగల్ ప్రాజెక్టును పంజాబ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయి. సర్దార్ సరోవర్ ప్రాజెక్టును నర్మదా నదిపై గుజరాత్‌లో నిర్మించారు. దీన్ని రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉమ్మడిగా ఉపయోగించుకొంటున్నాయి. బిహార్‌లో గండక్ ప్రాజెక్టును నిర్మించగా... బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్ ఉమ్మడిగా అనుభవిస్తున్నాయి. ఏపీ, తెలంగాణ లాగా ఈ రాష్ట్రాలు రచ్చకెక్కడం లేదు. నీళ్లతో రాజకీయాలు మిళితమైనందున తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి తటస్థించింది.శ్రీశైలం జలాశయం నుంచి సెప్టెంబర్ 7న ఉదయం 7 గంటల వరకూ 49,649 క్యూసెక్కుల నీరు వాడుకొన్నారు. అందులో 16,371 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు చేరింది. 33,278 క్యూసెక్కులు అంటే 2.89 టీఎంసీలు రెండు రాష్ట్రాలూ వాడుకున్నాయి. సెప్టెంబర్ 7 నాటికి పై నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా ఆగిపోయింది. సెప్టెంబర్ 6న ఉదయం శ్రీశైలంలో 136.603 టీఎంసీల నీరు ఉండగా, అది ఏడో తేదీ ఉదయానికి 134.250 టీఎంసీలకు తగ్గింది. అది పదో తేదీ ఉదయానికి 127.283 టీఎంసీలకు పడిపోయింది. అంటే నాలుగు రోజులకు ఇంచుమించు 10 టీఎంసీలు ఖాళీ అయ్యాయి. యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శి ఆదేశాల తర్వాతనే ఇది జరిగింది.రాష్ట్ర విభజన జరిగిన అరవై రోజుల లోపు గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం తొలుత బోర్డుల నియామకానికే బాగా కాలయాపన చేసింది. ఈ లోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. రాష్ట్ర విభజన చట్టం సబ్ సెక్షన్ 8, సెక్షన్ 85లోనే యాజమాన్య బోర్డుల విధులు గురించి స్పష్టంగా ఉంది. ఏడేళ్ల తర్వాత 2021 జూలై 15న ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఈ రోజుకూ అమలు చేయలేకపోతోంది.ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు ప్రాజెక్టులను స్వాధీనం చేయబోమని తెలంగాణ మొండికేసింది. శ్రీశైలం రిజర్వాయర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆధీనంలో, నాగార్జునసాగర్ రిజర్వాయర్ తెలంగాణ రాష్ట్ర ఆధీనంలో ఉన్నాయి. సాగర్ డ్యాం పైన రెండు రాష్ట్రాల పోలీసులు ఇంజనీరింగ్ అధికారులు మోహరించిన సంఘటనలు సాగునీటి చరిత్ర పుటల్లో మాయని మచ్చ. తుదకు శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లకు రూల్ కర్వ్‌ను (ఆపరేషన్ షెడ్యూల్) యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఇందులో శ్రీశైలం జలాశయం కనీస నీటిమట్టం 854 అడుగులుగా నిర్ణయించింది. రూల్ కర్వ్‌నకు మొత్తంగా తెలంగాణ ఆమోదం తెలపలేదు. కనీసం శ్రీశైలం జలాశయం రూల్ కర్వ్‌నకు ఇరు రాష్ట్రాలు అంగీకరించి ఉంటే ఈ ఏడాది ఈ పరిస్థితి ఏర్పడేది కాదు..

# పట్టపగలే ఇసుక అక్రమ రవాణా!

**చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు!**

**ఈ ఇసుక రవాణాకు సంభందించి అధికారిక అనుమతులు ఉన్నాయా..**

**ఎవరి అండదండలతో ఇసుక రవాణా చేస్తున్నారు..? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి**

మన దునియా,మహబూబాబాద్ జిల్లా:సెప్టెంబర్ 11

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కొత్తపల్లి, మొదనతూర్తి,మునగలవీడు గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా సాగుతుంది, అధికారులు నిఘా పెట్టకపోవడంతో అక్రమార్కులు ఆకేరు వాగు నుంచి ఇసుకను తోడేస్తూ రూ,లక్షలు గడిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పేరుతో ఒక్క లోడు అనుమ తితో నాలుగు ఐదు లోడుల ఇసుకను తరలిస్తున్నారు. నెల్లికుదురు మండల శివారు ఆకేరు వాగు అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారింది. పేదల సొంతింటి కల అయిన 'ఇందిరమ్మ ఇళ్లు' పేరును అడ్డుపెట్టుకుని ఇసుక మాఫియా పగటి పూట నిర్మానుష్య ప్రదేశాలలో, క్వారీ లలో డంపు చేసి రాత్రుళ్ళు పట్టణాలకు లారిల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తు దోపిడీకి పాల్పడు తున్నారు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు కాకపోవడంతో సామాన్యులకు ఇసుక అందని ద్రాక్ష లాగా మారింది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ, కొందరు ట్రాక్టర్ యజమాను లు సిండికేట్‌గా ఏర్పడి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు ఇసుకను అక్రమంగా తరలిస్తు లక్షల రూపాయలకు ఇసుకను కాంట్రాక్టర్ల కు విక్రయిస్తున్నారు.ఇసుక దొంగలు రాత్రి పగలు, అనే తేడా లేకుండా ఆకేరు వాగు ఇసుకను తరలిస్తుం డటంతో ఆకేరు నది సహజ వనరులు వేగంగా క్షీణించి పోయే అవకాశం ఉంది లబ్ధిదారుల పేరు చెప్పుకుని కొందరు అక్రమా ర్కులు లక్షలు గడిస్తుంటే,అధికారులకు గ్రామస్థులు, రైతులు ఫోన్ చేసి చెప్పినా, కన్నులముందే జరుగుతున్నా, మామూళ్ళ మత్తులో ఈ దందాను పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ట్రాక్టర్ యజమానులు అనుభవం లేని మైనర్ డ్రైవర్లను పెట్టుకుని, అతి వేగంతో ట్రాక్టర్ల దూసుకెళ్తుండ టంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని స్థానికలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదికార పార్టీ అండదండలతో కొందరు ఇసుక ట్రాక్టర్లు నడిపిస్తుంటే, ఇదే అదునుగా కొన్ని గ్రామాల్లో గ్రామ అభివృద్ధి పేరుతో టాక్సీ వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి అధికారులు ఇకనైనా మేల్కొని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
సెప్టెంబర్ । శనివారం । 12 । 2026


# గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి





**పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి**
**మూకమామిడిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం**

**మన దునియా,ములకలపల్లి:సెప్టెంబర్ 11**

మండలంలో మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు,బాలింతలకు, తల్లులకు పోషణ ప్రాముఖ్యతను వివరించారు.పౌష్టికాహారం యొక్క పోషక విలువలను తెలియజేశారు.ప్రతి గర్భవతి ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఒక పూట సంపూర్ణ భోజనం తీసుకోవాలని,గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం,గుడ్లు,పాలు వంటివి తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సామ్రాజ్యం, ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర్ లలిత,అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ,రాధ,విజయ,రమాదేవి, వసంత, సునీత మరియు పిల్ల తల్లులు గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీని జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ గా మార్చాడు : ప్రత్తిపాటి

ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నివేదికలు.. హైకోర్టు తీర్పులపై జగన్ మౌనం ఉద్దేశపూర్వకమా..లేక అర్థాంగీకారమా? : ప్రత్తిపాటి అనర్హులతో ప్రశ్న పత్రాల మూల్యాంకనం చేయించిన అధికారులపై జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? : ప్రత్తిపాటి ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు అప్పగించినా నాడు జగన్ నోరెత్తలేదు : ప్రత్తిపాటి ఏపీపీఎస్సీ అక్రమాల బాగోతాన్ని బయటపెట్టిన సిట్ నివేదికపై నోరెత్తని జగన్.. ఏ ముఖం పెట్టుకొని పారదర్శక మెగా డీఎస్సీని తప్పుపడుతున్నాడు? : ప్రత్తిపాటి“కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించిన మెగా డీఎస్సీపై అదేపనిగా బురదజల్లుతున్న జగన్.. తన హాయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై ఎందుకు నోరెత్తడం లేదు? ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ సర్వీస్ గా మార్చాడు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన డిజిటల్ వాల్యూయేషన్ పై జగన్ ఎందుకు స్పందించడం లేదు? ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు అప్పగించిన అధికారులపై నాడు ముఖ్యమంత్రి



# అన్ని వర్గాలకు అండ బి.ఎస్.పి జెండా

**వరంగల్ జోన్-2, జోన్ ఇంచార్జ్, వరికిల్ల మల్లేష్**

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా కేంద్రం ఆస్పరెంట్ అకాడమీ నందు మంచిర్యాల జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా వరంగల్ జోన్ 2 ఇన్చార్జి వరికిల్ల మల్లేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ముఖ్యఅతిథి వరికిల్ల మల్లేష్ మాట్లాడుతూ పూలే, చత్రపతి సాహు మహారాజ్, పెరియార్, అంబేద్కర్, కాన్సిరాం, ఇతర మహనీయుల వారి స్ఫూర్తి ఆశయ సాధన బహుజన్ సమాజ్ పార్టీ లక్ష్యమని అన్ని వర్గాలకు అండ బిఎస్పి జెండా అని అన్నారు వరికిల్ల మల్లేష్ గారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గం లలో బూత్ కమిటీలు, సెక్టర్ కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలని, మహనీయుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తలు నిరంతరం సిద్ధంగా ఉండాలని, ప్రజా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని మంచిర్యాల జిల్లాలో పార్టీ బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలన్నారు వరికిల్ల మల్లేష్, చెన్నూర్ నియోజకవర్గం నూతన ఇన్చార్జిగా దుర్గం గంగారం ను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ నెంబర్ శెట్టి ప్రవళిక మంచిర్యాల నియోజకవర్గ ఇంచార్జి పెట్టం చంద్రశేఖర్, నియోజవర్గం అధ్యక్షులు బండారి రాజ్ కుమార్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సిరివేని రాజేష్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దాగం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కుంటాల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు సెట్టి శంకరయ్య, జాగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల జీవితాల్లో మోడీ వెలుగులు నింపారు : రాంచందర్ రావు

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 11**



ప్రధాని మోడీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం నిర్వహిస్తోందన్నారు. జన్‌ధన్ ద్వారా 80 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, పేదల జీవితాల్లో మోడీ వెలుగులు నింపారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొడ్డు కమలాకర్

**పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

**మన దునియా,దండేపల్లి, సెప్టెంబర్ 11:**



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొడ్డు కమలాకర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా శుక్రవారం బొడ్డు కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను కేవలం పదవిగా కాకుండా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని కమలాకర్ అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.ఎస్సీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని, నాయకులు--కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని బొడ్డు కమలాకర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ప్రిన్సిపల్ సెక్రటరీ (పంచాయతీరాజ్) ఎం. దాన కిషోర్ లకు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు

**హైకోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు నోటీసులు జారీ**

**మన దునియా,మంచిర్యాల జిల్లా:సెప్టెంబర్ 11**





PRIMARY DETAILS

| | | | |
|---|---|---|---|
| ...ain ...mber | CC 4483/2026 | SR Number | CCSR 41841/2026 |
| No. | HBHC010579982026 | | |
| ...ioner | Mokasi Doulath Rao | Respondent | Sanjay Jaju, IAS |
| ...ioner ...ocate | CH RAVI KUMAR | Respondent Advocate | |
| ...gory | NON-SERVICE | District | MANCHERIAL |
| ...g Date | 21/08/2026 | Registration Date | 10/09/2026 |
| ...ng | - | Case Status | PENDING |
| ...ose | - | | |
| ...'ble | null | | |

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల పరిధిలో గల వెంకటాపూర్, వందుర్ గూడ గ్రామ పంచాయతీలను ఒక్కటే గ్రామ పంచాయతీ వెంకటాపూర్ గా కొనసాగించే విషయంలో గౌరవ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గతంలో - శాసనసభ, ప్రభుత్వం దృష్టికి తప్పుడు నివేదికలు పంపిన అధికారులను గుర్తించి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, తదనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ విషయాన్ని లెజిస్లేచర్ మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశీలించేలా చూడాలని ఆదేశాలు జారీ చేసి సంవత్సరం గడిచినప్పటికీ ఇప్పటివరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గౌరవ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు పరిచి మాకు న్యాయం చేయాలని అనేక సార్లు ఉన్నత అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ అధికారుల నుండి ఏ మాత్రం స్పందన రాకపోవటం వలన తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు ధిక్కరణ కేసు వేయాల్సి వచ్చిందని పిటిషనర్ కోవ దౌలత్ రావు మొకాశి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గౌరవ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం దాన కిషోర్ (పంచాయతీరాజ్) లకు వివరణ ఇవ్వాలని ఈ రోజు గౌరవ రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసి నాలుగు వారాలకు వాయిదా వేసినట్లు ఆయన తెలిపినారు. ఈ సందర్భంగా పిటిషనర్ కోవ దౌలత్ రావు మొకాశి మాట్లాడుతూ రెండు గ్రామ పంచాయతీలను కలిపి ఒకటే గ్రామ పంచాయతీ వెంకటాపూర్ గా కొనసాగించాలని, ప్రభుత్వానికి, లెజిస్లేచర్ కు తప్పుడు నివేదికలు ఇచ్చి వందుర్ గూడను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన అధికారులపై కోర్టు ఆదేశాల ప్రకారం సత్వరమే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రస్థాయి పోషణ మాసం కార్యక్రమం

**మన దునియా,సెప్టెంబర్ 11, మంచిర్యాల జిల్లా**



మందమర్రి సెక్టార్ పరిధిలోని నేతాజీ నగర్- 1 అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రస్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి హాజరై,పిల్లలకు పౌష్టికాహారం,పోషక విలువలు,ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ,డి.సంధ్య ఆధ్వర్యంలో పిల్లలకు వివిధ పోషకాహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రాధాన్యతను వివరించారు.పిల్లల ఎదుగుదల,ఎత్తు, బరువు తదితర అంశాలను పరిశీలించి, తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు, పిల్లలు,పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# కుటుంబ పంచాయతీలు.. మహిళా పోలీస్‌స్టేషన్ లకే పంపండి!

- భార్యాభర్తల వివాదాలను లా అండ్ ఆర్డర్ స్టేషన్లలో నెలల తరబడి విచారించడమెందుకు..?
- కౌన్సెలింగ్, కుటుంబ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక విభాగాలున్నా.. అక్కడికే రిఫర్ చేయాలని విజ్ఞప్తి

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 11**



భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ వివాదాలను సంబంధిత మహిళా పోలీస్‌స్టేషన్‌కు లేదా కుటుంబ వివాదాల పరిష్కారానికి ఉద్దేశించిన ప్రత్యేక విభాగాలకు రిఫర్ చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కొన్ని సందర్భాల్లో కుటుంబ వివాదాల పేరుతో లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లలోనే ఇరుపక్షాలను పదేపదే పిలిపిస్తూ, నెలల తరబడి విచారణ కొనసాగించడం వల్ల బాధితులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సమస్యను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించే బదులు సుదీర్ఘంగా స్టేషన్ చుట్టూ తిప్పడం పరిస్థితులను మరింత జటిలం చేసే ప్రమాదం ఉందని అంటున్నారు.తాజాగా అజాంజాహి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కుటుంబ వివాదాలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారిని పరిస్థితులకు అనుగుణంగా మహిళా పోలీస్‌స్టేషన్, కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలకు రిఫర్ చేసి, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాధితుల సమస్యలను సున్నితంగా పరిగణించి.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి కుటుంబ వివాదాన్ని అవసరమైనప్పుడు సంబంధిత ప్రత్యేక విభాగాలకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**స్కానింగ్ కేంద్రం నిర్వాహకుల తీరుపై డీఎంహెచ్‌వో ఆగ్రహం**

**తనిఖీల వేళ రచ్చ.. అధికారుల విధులకు ఆటంకం!**

**స్కానింగ్ కేంద్రం నిర్వాహకుల తీరుపై డీఎంహెచ్‌వో ఆగ్రహం**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: మన దునియా**




నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డీఎంహెచ్‌వో రాజశ్రీ పలు స్కానింగ్ కేంద్రాలు, నర్సింగ్‌హోమ్‌లు, ఆసుపత్రుల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల్లో అందుతున్న వైద్య సేవలు, నిర్వహిస్తున్న రికార్డులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు.శ్రీకృష్ణ స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తుండగా కేంద్ర నిర్వాహకులు, ఓ వైద్యురాలి భర్త, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల సందర్భంగా విధులకు ఆటంకం కలిగించేలా ఓ వైద్యురాలి భర్త దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు స్వయంగా సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసు కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు కూడా అనుమతులు లేని స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సూచించారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్న వైద్య సంస్థల్లోనే సేవలు పొందాలని కోరారు.

## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం

**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**మన దునియా,మంథని:సెప్టెంబర్ 11**



గ్రామీణ క్రీడాకారుల ను ప్రోత్సహించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో ఈ నెల 8న మంథని రూరల్, మంథని అర్బన్, ముత్తారం, రామగిరి ఎస్‌జీఎఫ్, జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా ప్రారంభించగా, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమ తులు అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ క్రీడాకారులకు క్రీడల ద్వారా ప్రతిభకు ప్రోత్సాహం అనే లక్ష్యంతో క్రీడా పోటీ లను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువు తో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వా సాన్ని పెంపొందిస్తా యని అన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాచ్ఛి రాజు గౌడ్, ఆర్ టిఐ మెంబర్ మంథని సురేష్, పీఈటి దొమ్మటి రవి, కొమురోజు శ్రీనివాస్, వివిధ పాటశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన

**‘వీ వాంట్ జస్టిస్’ అంటూ రోడ్డెక్కిన విద్యార్థులు**

**నిరసనతో సుమారు 2 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు**

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 11**



వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిరసనకు దిగారు. కళాశాల ఎదురుగా ప్రధాన రోడ్డుపైకి వచ్చిన విద్యార్థులు ‘వీ వాంట్ జస్టిస్’ అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.ఇదిలా ఉండగా, ప్రస్తుతం వినాయక చవితి నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా వినాయక విగ్రహాల విక్రయాలు కొనసాగుతుండటంతో ఇప్పటికే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసనతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. విద్యార్థుల ఆందోళన కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు.

# మట్టి వినాయకుల తయారీ (వర్క్ షాప్)

**మన దునియా,హనుమకొండ: సెప్టెంబర్ 11**




చిన్నారులలోని చిత్ర కళా నైపుణ్యాలను వెలికి తీసే దిశగా నాలుగు సంవత్సరాలుగా కళకు అంకితం అయి, చిత్ర కళకు సేవ చేస్తూ, ఎందరో చిన్నారులకు మెళకువలు నేర్పిస్తూ, శిక్షణ అందిస్తున్న సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఒ హెల్పింగ్ సొసైటీ హనుమకొండ ఈ సారి పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి వినాయకుల తయారీలో వర్క్ షాప్ నిర్వహించబోతుందని ... 5 సంవత్సరాలు పైబడిన వారు పాల్గొనవచ్చని.. వినాయకుని తయారీకి మట్టి సమకురుస్తామని ... పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాలు అందిస్తామని అకాడమీ డైరెక్టర్ డా. మంజుల సాగంటి ఒక ప్రకటనలో తెలిపారు... మట్టి విగ్రహాల తయారీ వల్ల ప్రకృతికి హాని లేకుండా భవిషత్తులో కొంతలో కొంతైనా మార్పు వస్తుందని పిల్లల్లో ఈ ధోరణి అలవాటు చేయాలనీ ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు... గత సంవత్సరం కూడా మట్టి వినాయకుల తయారీ, మట్టి దుర్గా మాత విగ్రహాల తయారీ వర్క్ షాప్ లు నిర్వహించామని... చాలా మంది పిల్లలు పెద్దలు పాల్గొన్నారని... ఇలా ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ సామాజిక మార్పు కోసం పాటు పడతామని తెలిపారు... పిల్లల్లో ఈ ధోరణి అలవాటు చేసేలా తల్లిదండ్రులు, పెద్దలు ప్రోత్సాహించా లని కోరారు... వారిలోని శిల్పకళ నైపుణ్యాన్ని ఈ రకంగా కూడా పెంచవచ్చని తెలిపారు...



# ఎల్ నినో.. మరింత భీకరం: అంచనాలకు మించిన స్థాయిలో.. !!

**మన దునియా,న్యూఢిల్లీ: సెప్టెంబర్ 11**

పసిఫిక్ మహాసముద్రంలో చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. ఇస్రో జరిపిన తాజా పరిశోధనల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.పసిఫిక్ మహాసముద్ర పరిధిలో ఎల్ నినో ప్రభావం ముందుగా అంచనా వేసిన దానికంటే తీవ్రంగా ఉన్నట్లు తేలింది. పసిఫిక్ మహాసముద్రం గగనతలంపై భారీగా మార్పులు చోటు చేసుకుంటోన్నాయని, ఇవి భవిష్యత్తులో గ్లోబల్ క్లైమేట్ వ్యవస్థపై చూపించబోయే తీవ్ర పర్యావరణ ప్రభావాలకు కేంద్రబిందువు అవుతుందని నాసా ఆందోళన వ్యక్తం చేస్తోంది.ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్టులు తాజాగా ఎల్ నినోపై ప్రత్యేకంగా శాటిలైట్ల ద్వారా అధ్యయనం చేశారు. గతంలో ప్రయోగించిన ఓషన్ శాట్ 3, ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ డేటాను దీన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. ఓషన్ శాట్ కలర్ మానిటర్ 3 , ఈఓఎస్-6 స్కాటెరోమీటర్ ఉపగ్రహాల నుంచి సేకరించిన కీలక డేటాను విశ్లేషించారు. దీని వివరాలను తాజాగా తన అధికారిక ఎక్స్ అకౌంట్ లో పొందుపరిచింది ఇస్రో.ఇందులో భాగంగా 2023 నుంచి 2026 వరకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సముద్ర ఉపరితల గాలులు, క్లోరోఫిల్ ఎ పరిమాణంలో సంభవించిన మార్పులను నిశితంగా అంచనా వేశారు. దీని ప్రకారం సాధారణంగా పసిఫిక్ రీజియన్ లో తూర్పు దిశగా వీచే గాలులు ఒక్కసారిగా బలహీనపడి, పడమర దిశగా వీచడం ప్రారంభించాయి. దీనివ్ల సముద్ర గర్భంలో సహజంగా చోటు చేసుకునే అప్ వెల్లింగ్.. అంటే కింది నీరు పైకి రావడం అనే ప్రక్రియ పూర్తిగా మందగించింది.

**గట్టిగా దెబ్బకొట్టిన ఎల్ నినో: విస్తుపోయే వాస్తవాలు**

ఫలితంగా చల్లటి నీరు సముద్ర ఉపరితలానికి చేరట్లేదు. ఫలితంగా.. సముద్రంలో పెరిగే ఏకకణ సూక్ష్మజీవులైన ఫైటోప్లాంక్టన్ వృద్ధి నిలిచిపోయింది. క్లోరోఫిల్ పరిమాణం భారీగా పడిపోయింది. సాధారణ




వాతావరణ పరిస్థితులు నెలకొన్న 2024, 2025 జూన్ నెలలతో పోలిస్తే, ఎల్ నినో పరిస్థితులు ప్రారంభమైన ఈ ఏడాది జూన్ నాటికి క్లోరోఫిల్ స్థాయిలో విపరీతమైన వ్యత్యాసం కనిపించింది. ఆందోళనకంగా దీని స్థాయి పడిపోయింది.ప్రత్యేకించి.. పశ్చిమ, మధ్య పసిఫిక్ లోని భూమధ్యరేఖ ప్రాంతాల్లో ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనిపించింది. సముద్ర ఉపరితల గాలులు, అక్కడ పెరిగే జీవజాతుల ఉత్పాదకతకు మధ్య ఎంతటి బలమైన పరస్పర సంబంధం ఉందో ఈ అధ్యయనం స్పష్టం చేసినట్టయింది. ప్రపంచ వాతావరణ సంస్థ గతంలో వెల్లడించిన అంచనాలకు అనుగుణంగానే ఇస్రో ఉపగ్రహాలు సేకరించిన తాజా డేటా ఉండటం వంటి ప్రాధాన్యతను సంతరించుకుంది. అత్యంత తేజోమయంగా వెలిగిపోనున్న ఆ గ్రహం: నేరుగా చూసే అద్భుత అవకాశం ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఎల్ నినో పరిస్థితులు బలపడేందుకు దాదాపు 80 శాతం వరకు అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూఎంఓ ముందే హెచ్చరించింది. ఇదే విషయాన్ని ఇస్రో సేకరించిన తాజా డేటా నిర్ధారించింది. జూలై నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ మరింత వేగవంతమైంది. ఒకవేళ ఎల్ నినో ప్రభావం గనుక ఇంకా తీవ్రమైతే, క్లోరోఫిల్ తక్కువగా ఉండే ప్రాంతాలు మరింత ముప్పును ఎదుర్కొనడం ఖాయం.

## ఘనంగా 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**

మందమర్రి లోని సింగరేణి గ్రౌండ్ లో 62వ వార్షిక క్రీడలు సాంస్కృతిక పోటీల భాగంగా హాకీ గేమ్ ను ప్రారంభించిన మందమర్రి సింగరేణి హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్, డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ?ఆరోగ్యం - మానసిక ఉల్లాసం. క్రమశిక్షణతో కూడిన ఆటలు మనుషులకు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయి అని అన్నారు. హాకీ విన్నర్స్ గా కే కే -5 గ్రూప్, హాకీ రన్నర్స్ గా కాసిపేట -2 గ్రూప్ గెలుపొందినారు.ఈ కార్యక్రమం లో జి.ఎం,ఆఫీస్ పి వో, ఎం.కార్తీక్ సార్ ,బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగాం మల్లేష్ , స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివ కృష్ణ ,జనరల్ కెప్టెన్ శ్రీను , క్రీడాకారులు పాల్గొన్నారు.



# బంద్ పేరుతో.. 10 బ్లాక్ మెయిల్..!







**రైతులను నిలువునా దోచిన రైస్ మిల్లర్లు**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే రూ.400 కోట్లకు పైగా ఎగవేత..?**

**మిల్లర్లు, అధికారులపై నమోదైన కేసులు**

**నయాపైసా తిరిగి చెల్లించని రైస్ మిల్లర్లు మెక్కింది చాలక మళ్లీ రైస్ మిల్లుల బంద్ డ్రామా**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

ధాన్యం సేకరణలో ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని గగ్గోలు పెడుతున్న రైస్ మిల్లర్ల నిజస్వరూపం ప్రజలకు ఎరుకే. సిఎంఆర్ ధాన్యం విషయంలో రైస్ మిల్లర్లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ దాడులు చేస్తూ కేసులు చేయడాన్ని ప్రధాన సాకుగా చూపుతున్న మిల్లర్లు ఆందోళనకు దిగారు. బంద్ పాటిస్తూనే రోజు వారిగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టడానికి సిద్ధం అయ్యారు. గురువారం నుంచి మిల్లులను మూసేసిన మిల్లర్లు తమ డిమాండ్ లను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు. ఒకవైపు అసెంబ్లీ కొనసాగుతుండగా, మరోవైపు మిల్లర్ల నిరసనలు చేయడం పట్ల ప్రభుత్వం సీరియస్ గా భావిస్తుంది. ప్రభుత్వాన్ని, చైతులను నిలువునా దోచుకున్న మిల్లర్లే ఇప్పుడు బాధితుల్లా బంద్ నాటకాలు అడుతున్నారు. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం నుంచి అందోళనలు షురూ చేశారు. నేడు గాంధీ చౌక్ వద్ద ధర్నా చేసి నిరసన చేపట్టనున్నారు.

# అధికారం పేరిట ఆధిపత్యం.. బూతుల 'సమీక్షలు'! నిజామాబాద్ జిల్లా వైద్య శాఖలో నియంత పాలన!

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

నిజామాబాద్ డి ఎం హెచ్ ఓ, వేధింపులు అధికారం పేరిట ఆధిపత్యం.. బూతుల 'సమీక్షలు'! నిజామాబాద్ జిల్లా వైద్య శాఖలో నియంత పాలన! వైద్య శాఖ అంటేనే నిమిషం విరామం లేకుండా ప్రజల ప్రాణాలు కాపాడే పవిత్రమైన రంగం. కానీ, నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం డి ఎం హెచ్ ఓ మాత్రం ఒక మానసిక నరకకూపంగా మారింది. సమీక్షా సమావేశం అంటే సలహాలు, సూచనలు ఇచ్చే వేదిక కాదు.. ఉద్యోగులను అణచివేసే, అవమానించే అరాచక స్థావరం! "నల్ల మొఖాలు, దొంగలు, మీ మొఖం చూడాలంటే అసహ్యం.. మీరంతా వేస్ట్, మీకు జీతం ఇవ్వడం దండగ, ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోండి!" -- ఇవీ ఒక ఉన్నతాధికారి నోటి నుంచి నిత్యం జాలువారే 'అమృత' వాక్యాలు! అధికారం పేరిట ఆధిపత్యం.. బూతుల 'సమీక్షలు'! నిజామాబాద్ జిల్లా వైద్య శాఖలో నియంత పాలన! హరాస్మెంట్ నిజామాబాద్ వైద్య శాఖలో వేధింపులు వైద్య శాఖ అంటేనే నిమిషం విరామం లేకుండా ప్రజల ప్రాణాలు కాపాడే పవిత్రమైన రంగం. కానీ, నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం డి ఎం హెచ్ ఓ మాత్రం ఒక మానసిక నరకకూపంగా మారింది. సమీక్షా సమావేశం అంటే సలహాలు, సూచనలు ఇచ్చే వేదిక కాదు.. ఉద్యోగులను అణచివేసే, అవమానించే అరాచక స్థావరం!"నల్ల మొఖాలు, దొంగలు, మీ మొఖం చూడాలంటే అసహ్యం.. మీరంతా వేస్ట్, మీకు జీతం ఇవ్వడం దండగ, ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోండి!" -- ఇవీ ఒక ఉన్నతాధికారి నోటి నుంచి నిత్యం జాలువారే 'అమృత' వాక్యాలు! నిజామాబాద్ డి ఎం హెచ్ ఓ వేధింపులు మానసిక క్షోభతో నలిగిపోతున్న ఉద్యోగులుప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి, సమీక్షల పేరిట నడిచే ఈ 'దర్బార్'లో కింది స్థాయి ఉద్యోగుల నుంచి సమాన హోదా కలిగిన సివిల్ సర్జన్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డమ్ ఉహోం ల వరకు ఎవరికీ మినహాయింపు లేదు.వ్యక్తిగత అవహేళనలు: సమీక్షలో అందరి ముందూ నిలబెట్టి, ఉద్యోగానికి సంబంధం లేని వ్యక్తిగత విషయాలను లాగుతూ వెటకారంగా మాట్లాడటం సదరు అధికారికి అలవాటు.నోరెత్తితే వేధింపులే: "ఇది తప్పు" అని ఏ ఉద్యోగి అయినా సాహసించి చెప్పాడా.. అంతే సంగతులు! "నోరు మూయ్, వీడికి పనీ చేతకాదు, వీడిపై ఫైల్ పుట్ అప్ చేయ్" అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు.కక్షసాధింపు చర్యలు: ఎదురు తిరిగిన వారికి సెలవులు మంజూరు కావు, జీతాల్లో కోతలు, ఎంక్వైరీలు, వరుస మెమోల జారీతో మానసికంగా వేధించి లొంగదీసుకుంటారు.రాజీనామాలు, లాంగ్ లీవ్‌లు.. ఇవే సమాధానాలు! ఈ అధికారి వేధింపులు తాళలేక వ్యవస్థ ఎంతగా అతలాకుతలమైందో చెప్పడానికి ఇవే ఉదాహరణలు:సదరు అధికారి ధోరణి నచ్చక ఒక .డమ్ ఉహోం స్థాయి అధికారి ఏకంగా రెండు నెలల లాంగ్ లీవ్‌పై వెళ్లాల్సి వచ్చింది.ఆరేళ్లుగా నమ్మకంగా పనిచేసిన ఒక ఉద్యోగి మనస్తాపంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు.అనుబంధంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థల ఎన్జీవోస్ ఉద్యోగులు సైతం ఈ వేధింపులు భరించలేక వైదొలిగారు.కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను అసలు మనుషులుగానే చూడకుండా, టెర్మినేట్ చేస్తామని, ఏజెన్సీలకు అటాచ్ చేస్తామని బెదిరించడం నిత్యకృత్యమైంది.

నిజామాబాద్ డిఎంహెచ్వో వేధింపులు 'కోటరీ' రాజ్యాంగం!

జిల్లా స్థాయి అధికారులు డిపార్ట్‌మెంట్ సమస్యలను విన్నవించుకుందామని వస్తే.. "నాకు చెప్పొద్దు, ఉన్నవాటితోనే చేయండి.. లేదా ఉద్యోగం మానేయండి" అని కఠినంగా ముఖం మీదే చెప్తారు.అయితే, తన సొంత 'కోటరీ' చెప్పే మాటలను మాత్రం కళ్ళు మూసుకుని వింటారు. ముఖ్యంగా ఒక సీనియర్ అసిస్టెంట్ ఈ అధికారికి చేదోడువాదోడుగా ఉంటూ, ఆర్థిక వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిజామాబాద్ డిఎంహెచ్వో హరాస్మెంట్ బదిలీ అయినా మళ్లీ వాలారు.. బెదిరింపులు పెంచారు!

గతంలో ఈ అధికారి వేధింపులపై ఉద్యోగ సంఘాలు, ఐ ఎం ఏ ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఉద్యోగులు ఆనందంతో మిఠాయిలు పంచుకుని, వాట్సాప్ స్టేటస్‌లు కూడా పెట్టుకున్నారు.కానీ, అంతలోనే ఏ అభయహస్తం లభించిందో తెలియదు.. తను తిరిగి అదే సీటులో వాలారు! వచ్చీ రాగానే.. "నేను వెళ్ళిపోతాను అనుకున్నారా? వెళ్ళాను, తిరిగి వచ్చాను.. మిమ్మల్ని అస్సలు వదలను" అంటూ స్టేటస్‌లు పెట్టుకున్న వారిపై కక్షగట్టి మరీ వేధిస్తున్నారు." డిఎంహెచ్వో స్థాయిలోనే ఉండి కూడా మనం ఏమీ చేయలేకపోతున్నాం.. ఆఖరికి మేడమ్‌పై తిరగబడితే ఎక్కడ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతారోనని భయపడాల్సి వస్తోంది" -- ఒక అధికారి ఆవేదన

నిజామాబాద్ డి ఎం హెచ్ ఓ హరాస్మెంట్ కలెక్టర్ విచారణ చేపట్టాలి!

ఒక అధికారి నియంతృత్వ వైఖరి వల్ల జిల్లా వైద్యారోగ్య శాఖ వ్యవస్థాత్మకంగా పతనం అవుతోంది. మానసిక ప్రశాంతత లేక నిత్యం నరకం చూస్తున్నామని ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, సదరు అధికారి వ్యవహార శైలి, ఉపయోగించే భాష, ఆర్థిక లావాదేవీలు, తన కోటరీపై పూర్తిస్థాయి అంతర్గత విచారణ జరిపించాలి.ఉద్యోగులు భయం లేకుండా నిజాలు చెప్పడానికి అనువుగా వారి అభిప్రాయాలను గోప్యంగా కాన్ఫిడెంటిల్ సేకరించి, శాఖను ఈ 'నియంత' పిడికిలి నుంచి కాపాడాలని బాధితులు కోరుతున్నారు




# చేయూత పెన్షన్లపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 11**

చేయూత పెన్షన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వంబి కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఒంటరి మహిళలకు ఆర్థిక సాయం మంజూరులో నిబంధనలను ప్రభుత్వం సవరించింది.బివిడిపోయిన కాలానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో స్థానిక విచారణకు కొత్త అధికారులకు బాధ్యతలు అప్పగించింది.తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లను స్థానిక విచారణ అధికారులుగా రాష్ట్ర ప్రభుత్వం చేర్చింది. చేయూత పెన్షన్లలో అర్హుల గుర్తింపునకు అధికారుల పరిధిని విస్తరించింది. సెర్ప్ ప్రతిపాదనల మేరకు నిబంధనల్లో తెలంగాణ సర్కార్ మార్పులు చేసింది.

## జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి గా సోమరప్ శామ్యూల్ ఎన్నిక

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**



మంచిర్యాల జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శిగా నన్ను నియమించి, నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ అండ్ ఫ్యాక్టరీస్, గనులుఅండ్ భూగర్భశాస్త్ర శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి , టీపీసీసీ ఎస్ సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్ సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ కి నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడికి, కార్యకర్తకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.ఈ పదవి నాకు గౌరవం మాత్రమే కాదు ఒక గొప్ప బాధ్యత.నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, వారి హక్కులు, సంక్షేమం సామాజిక న్యాయం కోసం నాకు చేతనైనంత ఉత్తమంగా, నిజాయితీతో, నిబద్ధతతో పనిచేస్తాను.నాకు లభించిన ఈ అవకాశం నా వ్యక్తిగత గౌరవం కాదు ప్రజలకు సేవ చేసే బాధ్యత.మీ అందరి ఆశీస్సులు, సహకారం మార్గదర్శకత్వంతో ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు నా శక్తి మేరకు కృషి చేస్తాను అని అన్నారు.

## ఘనంగా 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**



మందమర్రి లోని సింగరేణి గ్రౌండ్ లో 62వ వార్షిక క్రీడలు సాంస్కృతిక పోటీల భాగంగా హాకీ గేమ్ ను ప్రారంభించిన మందమర్రి సింగరేణి హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్, డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యం - మానసిక ఉల్లాసం. క్రమశిక్షణతో కూడిన ఆటలు మనుషులకు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయి అని అన్నారు. హాకీ విన్నర్స్ గా కే కే -5 గ్రూప్, హాకీ రన్నర్స్ గా కాసిపేట -2 గ్రూప్ గెలుపొందినారు.ఈ కార్యక్రమం లో జి.ఎం,ఆఫీస్ పి వో, ఎం.కార్తీక్ సార్ ,బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగాం మల్లేష్ , స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివ కృష్ణ ,జనరల్ కెప్టెన్ శ్రీను , క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ యు ఐ కమిటీ లో గంట రాకేష్ కి రాష్ట్ర కార్యదర్శి పదవి

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**



ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కమిటీలో మందమర్రి విద్యార్థికి చోటు దక్కించుకొని నియామక పత్రం అందజేసిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వెంకటస్వామి, ఎన్ ఎస్ యు ఐ జాతీయ లీగల్ సెల్ కో కన్వీనర్ అక్బర్ మందమర్రి విద్యార్థి నాయకుడు గంట రాకేష్‌కు గౌరవం దక్కిందని కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ ఎస్ యు ఐ శుక్రవారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి పదవుల జాబితాలో గంట రాకేష్‌కు రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. మందమర్రికి చెందిన రాకేష్ విద్యార్థి దశ నుంచే సామాజిక, విద్యార్థి సమస్యలపై చురుగ్గా పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తూనే, విద్యార్థి నాయకుడిగా కొనసాగుతున్నారు.మందమర్రి నుంచి ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకోవడం పట్ల విద్యార్థి, యువజన వర్గాల్లో హర్షం వ్యక్తం చేశారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## నగరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో బైక్? ర్యాలీ



**నిజామాబాద్ జిల్లా: దునియా :ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో నిజామాబాద్ అధికారులు, సిబ్బంది బైక్? ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ మార్టీర్స్ వారి త్యాగాలను మరువలేం.. అమరవీరుల స్మారక స్థూపం వద్ద జిల్లా అటవీ అధికారి డఫో ఓ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం జిల్లా అటవీశాఖాధికారి మాట్లాడుతూ.. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని ఖేజర్లీ గ్రామంలో పవిత్రమైన చెట్లను నరకకుండా కాపాడేందుకు అమృతదేవి బిష్ణోయ్ నాయకత్వంలో 363 మంది బిష్ణోయ్ తెగ ప్రజలు తమ ప్రాణాలను బలిదానం చేశారు. వారి అమరత్వానికి గుర్తుగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 11ను 'జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం'గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అటవీ సంపద దోపిడీని అడ్డుకోవడం, కలప స్మగ్లర్లు, వేటగాళ్లను నిరోధించడం మరియు దావానలాల ఫారెస్ట్ ఫిర్స్ నుండి అడవులను కాపాడటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న ఫ్రంట్‌లైన్ సిబ్బంది సేవలు అజరామరమైనవని ప్రశంసించారు. అటవీ శాఖ అండగా ఉంటాం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అటవీ అమరవీరుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, వారి సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని డీఎఫ్?వో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు ఫ్రాస్ సెక్షన్ ఆఫీసర్లు ఫసోస్ బీట్ ఆఫీసర్లు ఫబోస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేటలో మహిళపై హత్యాయత్నం

**సకాలంలో స్పందించిన పోలీసులు**

**మన దునియా,**



చిలకలూరిపేటలో జరిగిన ఓ హత్యాయత్నంసమాచారం అందుకున్న వెంటనే అర్బన్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్ర గాయాలపాలైన బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ రమేష్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ దాడి ఎలా జరిగింది, దీని వెనుక ఉన్న కారణాలు ఏంటి అనే దానిపై ఆయన అన్ని కోణాల్లో దర్యాప్తును చేశారు. కాగా, బాధితురాలికి ప్రస్తుతం ఎటువంటి ప్రాణహాని లేదని వైద్యులు స్పష్టం చేశారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## మంచిర్యాల జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్ గా మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ఎన్నిక

**మన దునియా, సెప్టెంబర్ 11,మంచిర్యాల జిల్లా**



బీజేపీ ఎండోమెంట్ సెల్ మంచిర్యాల జిల్లా బీజేపీ ఎండోమెంట్ సెల్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ పదవికి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ని నియమించడం జరిగిందని మంచిర్యాల జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సూచన మేరకు, బీజేపీ ఎండోమెంట్ సెల్ తెలంగాణ రాష్ట్ర స్టేట్ జాయింట్ కన్వీనర్ కొండమీది మల్లేశం సమన్వయంతో, రాష్ట్ర ఎండోమెంట్ సెల్ స్టేట్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్య ప్రకాష్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ని బీజేపీ ఎండోమెంట్ సెల్ మంచిర్యాల జిల్లా కన్వీనర్‌గా నియమించారు. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా, ఎండోమెంట్ సెల్ కార్యక్రమాలను మంచిర్యాల జిల్లాలో బలోపేతం చేస్తూ, దేవాలయాలు, ధార్మిక సంస్థలు మరియు ధార్మిక కార్యక్రమాల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాము. అలాగే జిల్లాలోని మండల, అసెంబ్లీ నియోజకవర్గ గ్రామస్థాయి కమిటీలను సమన్వయం చేసుకుంటూ ఎండోమెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేయాలని కోరుతున్నాము. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



## గ్లోబల్ స్టార్స్ కోసం వేట.. సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక.. యువతకు కీలక సందేశం!

**ప్రముఖ కొరియన్ సంస్థ హైబ్ ఇండియా ఆడిషన్స్‌తో జతకట్టిన రష్మిక**

**భారతీయ యువతలో ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమ లక్ష్యం**

**ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలంటూ యువతకు స్ఫూర్తినిచ్చిన నటి**

**ప్రస్తుతం 'రణబాలి' చిత్రంతో బిజీగా ఉన్న రష్మిక మందన**

స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' (న్దీజు). ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్‌లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ (ఒఞ), న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది. ఇక, సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన కరువు నెలకొన్న నేపథ్యంలో తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడు అనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com